# చతుర్ముఖి

-అయినాల కనకరత్నాచా

రేణుకాదేవి ఉరఫ్ రేణుకమ్మకి భర్త, యిద్దరు కొడుకులు, ఒక కుమార్తెతో చూడ చక్కని కాపురం. ఐశ్వర్యం నట్టింట నాట్యంజేసే కుటుంబం. ఆ యింట రేణుకమ్మ మాటకు వ్యతిరేక వోటు యే నోటి నుండీ వెలువడదు. శ్రీకృష్ణుడు కుడిచేతి చూపుడు వేలితో చక్రం తిప్పి మహాభారతాన్ని నడిపిస్తే, రేణుకమ్మ ఎడమ చేతి చిటికెన వేలితో చక్రం తిప్పుతూ సంసారాన్ని యేలుతోంది.

1

పెళ్ళైన తరువాత వచ్చిన మొదటి పండుగకు భర్తతో పుట్టింటికొచ్చింది వనజ. అదే రేణుకమ్మ ఒక్కగానొక్క కూతురు. సాయంత్రం భర్త యింట్లో లేనపుడు తల్లి ముందు తన కష్టమంతా కక్కుకుంది. "అమ్మా! అత్తగారింట్లో నాకు చాలా కష్టంగా వుందమ్మా! అత్తగారు నా అభిప్రాయాల్ని, అభిరుచుల్ని పలుచన జేస్తూ, పాత గుడ్డల్లా తీసి పక్కన పారేస్తోంది. అంతా ఆమెదే పెత్తనం. ఇంటికి పెద్ద కోడల్ని కదా! పనిమనిషి కంటె హీనంగా చూస్తుంది. అంతా ఆమెదే రాజ్యం. మామయ్య గారున్నారన్న మాటేగాని యేమీ పట్టించుకోరు. ఆమె చెప్పినట్లల్లా గంగిరెద్దులా తలూపుతుంటారు."

"ఇంతకీ నీ మొగుడన్నా నీ చేతిలో వున్నాడా?" అనుమానంగా అడిగింది రేణుకమ్మ.

"ప్రస్తుతానికి యీయన నా చేతిలో వున్నట్లే. కాపురానికి పోయేటప్పుడు నీవిచ్చిన సలహాలు, సూచనలు, చిట్కాలూ తు.చ. తప్పకుండా పాటిస్తున్నాను."

"అలాగయితే నీవేం దిగులు పడకమ్మా! ఉగాది లోపల నీచేత వేరు కాపురం పెట్టించి, నీకు స్వాతంత్ర్యం తెప్పిస్తాను. ఈ మూడు నెలలెలాగో సర్దుకుపో. అదను చూసి అల్లుడిగారితో యీ విషయం ప్రస్తావించి నా పథకానికి అంకురార్పణ చేస్తాను. అల్లుడ్ని మాత్రం జాగ్రత్తగా పట్టుకురా!" అంటూ ప్రేమగా వనజ తల నిమిరింది రేణుకమ్మ.

తల్లి సమర్థత తెలిసిన వనజ "అలాగేనమ్మా! నువ్వు చెప్పినట్లే నడుచుకుంటాను. కొంగు ముడి విప్పను" భరోసాగా అన్నది వనజ.

"నాకు గూడా నా కూతురు అచ్చటా, ముచ్చటా చూస్తూ అక్కడ నాలుగు రోజులుండాలన్నా కష్టంగా వుంది. అదే నీవు విడిగా వుంటే మే మనుకున్నప్పుడల్లా వచ్చి, అక్కడ కొన్నాళ్ళైనా ఫ్రీగా వుంటాము గదా! అలాగే నువ్వు యిక్కడకు రావడానికి, పట్టుమని పుట్టింట్లో పదిరోజులుండడానికీ వీలుగా వుంటుంది. ఆమె ఆజ్ఞలతో చచ్చిపోతున్నాం. రెండు మూడు నెలల్లో నీ సమస్య పరిష్కారమైపోతుంది. ఆ తరువాత మన రావడాలు- పోవడాలు- వండటాలు- పండటాలూ అంతా మనిష్టం" దృఢ విశ్వాసంతో చెప్పింది రేణుకమ్మ.

తరువాత మూన్నెల్లు తిరక్కుండానే, వనజ అత్తగారితో పోరాడి, మీతో వుంటే నా కుతురు ఆత్మహత్య జేసుకుంటుందనీ, మీమీద వరకట్నం, హెరాస్‌మెంట్ మొదలైన కేసులు పెట్టి మీకు ముప్పు తెస్తామనీ బెదిరించి, హెచ్చరించి, పోట్లాడి వనజతో వేరు కాపురం పెట్టించింది.

ఓ శుభ ముహూర్తాన విషయమంతా బుచ్చిబాబుతో చెప్పింది. బుచ్చిబాబు నిర్ఘాంతపోయి జుట్టు పీక్కున్నాడు. 'ఇది ఆడదా? ఆదిశక్తా!' అనుకుని "బంగారం లాంటి కుటుంబాన్ని రెండుగా చీల్చావు గదే! మనకూ కొడుకులున్నారుగా. మన కోడళ్ళూ, వియ్యాలవారూ అలాగే చేస్తే మనకెలా వుంటుంది? మన స్వార్థం మనం చూసుకుంటే వాళ్ళ కడుపు కోత యెంతుంటుందో ఆలోచించావా?" అని మాత్రం అడగ్గలిగాడు, అంతకు మించి మాట్లాడితే వచ్చే కష్టాలు తెలుసుగాబట్టి.

"మీరేం మనిషండీ! ఎవరైనా తమ కూతురు సుఖం కోరుకుంటారు గాని మీలా యెవరూ వుండరు. మనమ్మాయి సుఖం కోసం, మన ఆనందం కోసమే నేనిలా చేశాను" అన్నది రేణుకమ్మ సెంటిమెంటు రంగరిస్తూ.

"అంతా అయిపోయాక యిప్పుడు నేనేం చెప్పీ లాభంలేదు. నాలుగు రోజులు అమ్మాయి దగ్గరుండొస్తాను అని అమ్మాయి దగ్గరకు పోవడంలో యింత గోల్‌మాల్ వుంటుందనుకోలేదు. ఇదెంతకైనా తగును" అనుకున్నాడు బుచ్చిబాబు రేణుకమ్మ వైపు గుడ్లెళ్ళబెట్టి చూస్తూ.

2

అత్తగారికి సీరియస్‌గా వుందని కబురు వస్తే భార్యను పుట్టింటికి తీసుకొని పోయిన అనంతు ఆ రాత్రికే తిరిగి వచ్చాడు. భోజనం చేస్తూ చెప్పాడు "అమ్మా! గిరిజ యిక వచ్చేట్టు లేదు. ఇక్కడ తనకు స్వేచ్ఛగా లేదని, కష్టంగా వుందని యింట్లో చెప్పేసింది. వాళ్ళు యీ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారు" అని.

పక్కనే భోజనం చేస్తున్న బుచ్చిబాబు "పండండి సంసారాన్ని గండ్ర గొడ్డలి లాంటి నీ నాలుకతో పగల గొట్టి చీల్చేశావ్. నీకూ అదే గతి రాక్షసీ!" అనుకుంటూ "ఇప్పుడేం చేస్తావు?" అన్నట్లుగా రేణుకమ్మ ముఖం చూస్తూ కళ్ళెగరేశాడు.

"నిన్నేమైనా అడిగారా?" త్రాసుపాములా బుసలు కొడుతూ అడిగింది రేణుకమ్మ.

"అడిగారు" తలవంచుకునే చెప్పాడు అనంతు.

"ఏమని?" గద్దించింది రేణుకమ్మ.

"బాబూ! నీకు కోటి రూపాయలకు పైగా కట్నం యిచ్చాం. దాంతో యెంతో వ్యాపారం చేసుకోవచ్చు. కావాలంటే యింకా గూడా సాయంజేస్తాం. మీ ఆస్తి పాస్తుల్లో నీకు భాగమీయకపోయినా ఫరవాలేదు. మాకున్నది ఒక్కగానొక్క కూతురు. అది బాధపడుతుంటే మేము చూడలేము. కావాలంటే మా ఫ్యాక్టరీలో భాగం రాసిస్తాము. నీవు యిక్కడే వుండిపో. మా అమ్మాయి సుఖంగా వుంటుంది" అన్నారు.

"నువ్వేం చెప్పావు?"

"నేనేమీ చెప్పలేదమ్మా! ఏమి చేయాలన్నా మా అమ్మ అనుమతి కావాలి. అమ్మతో మాట్లాడి చెబుతాను అన్నాను" భయం భయంగా చెప్పాడు అనంతు.

ఆ మాట విన్న రేణుకమ్మ తలక్రిందికీ, పైకీ నాలుగుసార్లు వూపి "దెబ్బతిన్నావు యశోదమ్మా (వియ్యపురాలు) నీ అల్లుడు వేరుగానో, లేకపోతే నీ యింట్లోనో మాకు దూరంగా వుండాలనే కోరికైతే వుంది గాని, మొగుడ్ని తన కొంగుకు యెలా ముడివేసుకోవాలో నీ కూతురుకు చెప్పినట్లు లేదు. ఈ ఒక్క పాయింటు చాలు నా కొడుకును నా దగ్గరే వుంచుకోవడానికి. నీ కూతుర్ని నా యింటికి రప్పించడానికి" అనుకుని అనంతు వైపు తిరిగి, "నువ్వేమైనా ఒప్పుకున్నావా అనంతూ!" అని అడిగింది.

"లేదమ్మా! నీకు తెలియకుండా యీ యింట్లో ఎవరూ యేమీ చేయరు. చేయలేరు. నేనా సాంప్రదాయానికి చిల్లులు పెట్టి చెడుపేరు తెచ్చుకోవాలనుకోవడం లేదమ్మా!"

"శభాష్! నా బిడ్డవనిపించుకున్నావు బాబూ! నా ప్రాణం నీ చేతుల్లో పోవాలనే గదరా నిన్ను నా కోరిక మేరకు పెంచుకున్నాము. నువ్వు పొరబడవని నాకు తెలుసు. అది నా పెంపకం" అంటూ అనంతు వీపు ఎద్దు మూపురాన్ని నిమిరినట్లు సుతారంగా నిమిరింది

## మనిషే ఎందుకిలా..?

కోయిల తన పంచమాన్ని
మించిపోతోందా?
ఆమని తన చిగుళ్లను
మార్చుకుంటోందా?
నది తన ప్రవాహ వేగాన్ని
సహించలేకపోతోందా?
సప్తస్వరాలు తమ స్థానాలను
తప్పుతున్నాయా?
సూర్యచంద్రులు తమ గతులు
తప్పుతున్నారా?
పూలు తమ పరిమళ వితరణను
విరమించుకుంటున్నాయా?
చెట్లు తమ రంగుల్ని
మార్చుకుంటున్నాయా?
ధరణి పాపాత్ముల ధోరణిని
భరించలేనంటోందా?
ఏదీ.. తన దారి తప్పటంలేదు
మరి మనిషి తప్పడమేంటి?
రంగులు మార్చుకోడమేంటి?
ఏ ఎండకా గొడుగు కాదు
ఏ మనిషికా గొడుగు పడుతూ
తనకు గొడుగనేది
లేకుండా చేసుకోడమేంటి?

-చిమ్మపూడి శ్రీరామమూర్తి

రేణుకమ్మ.

"తండ్రి బుద్ధులొచ్చాయి వెధవకి. వీడిదిక బానిస బ్రతుకే. చచ్చేదాకా స్వాతంత్ర్యం రాదు" అనుకున్న బుచ్చిబాబు.

"మీ అత్తగారు యింకేమన్నారు బాబూ!" అన్నాడు అనునయంగా.

"ఇంకేమీ అనలేదు డాడీ! రేపో మాపో యీ విషయం తేల్చుకోడానికి యిక్కడికొస్తామన్నారు."

"ఏడిశారు. ఇక్కడికొచ్చి వాళ్ళేం బావుకుంటారు. మీ అమ్మ సంగతి వాళ్ళకు సరిగ్గా తెలియదు. నాగు బాముల్లా వచ్చి మట్టిపాముల్లా పారిపోతారు. చూస్తూ వుండు" అన్నాడు బుచ్చిబాబు తలవంచుకునే.

"ఇన్నాళ్ళకైనా నా గొప్పదనాన్ని గుర్తించినందుకు సంతోషం. రానీండి. ఇంకో వెయ్యి జన్మలెత్తినా నా కొడుకుని నాకు గాకుండా చేయడం వాళ్ళ తరం గాదు. అంతగా వ్యవహారం చేయిదాటిపోతే వాళ్ళ డబ్బు వాళ్ళ మొహాన కొట్టి, మనబ్బాయి చేత విడాకులిప్పించి యింకో

## ఆడపిల్లంటే అలుసెందుకో?

ఒక కాలంలో
ఆడపిల్ల పుట్టిందంటే
ఇంటిల్లిపాది మురిసిపోయేవారు
మహలక్ష్మి పుట్టిందని
మరికొన్నాళ్ళ క్రితం
ఆడపిల్లే పుట్టాలని
కోరుకొనే వారు
ఆడపిల్లను కన్యాశుల్కం క్రింద
అమ్మేవారు
కన్యాశుల్కం డబ్బుతో
ఓ పది రోజులపాటు తిండికి ఇబ్బంది
ఉండదనుకునేవాడు తండ్రి
అందుచేత ఎంతమంది ఆడపిల్లలున్నా
పరవాలేదనుకొనేవారు
ఈనాడు పిండం
కడుపులో పడిందంటే చాలు
అందరికి దడ పుట్టుకొస్తోంది
ఉన్నది ఆడపిల్లే అని తెలిస్తే చాలు
భ్రూణహత్యే
మగపిల్లవాడైతే వంశోద్ధారకుడు
పున్నామ నరకం నుండి రక్షిస్తాడనే ఓ నమ్మకం
ఇన్ని చేసినా ఓ మగాడికి
ఆడదే భార్యగా ఉండాలి
మరో క్రొత్త శిశువు సృష్టిలో
ఆడదే కావాలి
క్రొత్త వస్తువుల ప్రచారానికి
మోడల్స్‌గా ఆడదే కావాలి
చదువులో, ర్యాంకులో
ఉద్యోగాల శాతంలో
ఆడవారే ముందంజగా ఉన్నా
ఎందుకో ఆడపిల్లంటే
ఇంకా ఎందుకో ఈ అలుసు.

–రాయప్రోలు వామనమూర్తి

నిక్షేపం లాంటి సంబంధం చేస్తాను. నన్ను తక్కువ అంచనా వేశారు వాళ్ళు" అన్నది రేణుకమ్మ పౌరుషంగా.

"నీ సంగతి, నీ సామర్థ్యం వాళ్ళకు తెలియదులేవే. నీవే గెలుస్తావు" అన్నాడు బుచ్చిబాబు సింక్‌లో చేయి కడుక్కుంటూ.

రెండు రోజుల తరువాత అనంతు అత్తమామలు వచ్చి విషయం కదిలించారు.

అందుకు రేణుకమ్మ వియ్యపురాలి నుద్దేశించి "చూడండి వదినగారూ! నాక్కావలసింది నా కొడుకూ, కోడలూ ఆనందంగా నా కళ్ళముందు నట్టింట తిరగడం. మా అనంతు మీద నాకెన్నో ఆశలున్నాయి. వాడు యీ యింటి ప్రథమ సంతానం. అల్లారుముద్దుగా పెంచాము. ఇప్పటికీ వాడు నేను పెట్టందే అన్నం తినడు. అటువంటి నా బిడ్డ నాకు దూరం కావడం నాకు మరణంతో సమానం. ఒకవేళ అదే జరగవలసి వస్తే నా కొడుకును కిచెన్ రూములో వేసి గాస్ వోపెన్‌చేసి యిద్దరమూ మాడి మసైపోతాము. లేదా నా కొడుకు నాకు దూరంగా వుండడం అంటూ జరగవలసి వస్తే, అది నా ప్రాణం పోయిం తర్వాతే" తేల్చి చెప్పింది రేణుకమ్మ.

ఆ మాటకు అదిరిపోయిన వియ్యంకుడు వాసుదేవ రావు "అంత మాటనకు తల్లీ! మా అమ్మాయి ఎక్కడున్నా పసుపు కుంకుమలతో పచ్చగా వుంటే అంతే చాలు. అలాగే మీ దగ్గరే వుంచుకోండి. మా జీవితంలో యెప్పుడూ యీ ప్రస్తావన తేబోము" అన్నాడు అనునయంగా.

"బిడ్డను మేము కన్నాముగాని, రాతను మేము రాయలేదుగా! ఏ పాపాన్నీ మూటగట్టుకోవడానికి మేము సిద్ధంగా లేము. మా అమ్మాయిని రేపే తీసుకొచ్చి దింపుతాము. ఆపై మీ యిష్టం" అన్న యశోదమ్మ కళ్ళొత్తుకుంటూ "రండి. వెళ్ళిపోదాం" అంటూ భర్తతో పాటు బయటపడి కారెక్కింది.

"అమ్మమ్మో! ఎంతకైనా తగుదువే. సినిమాల్లో నటిస్తే దీనికి ఆస్కార్ ఎవార్డు ఖాయం. మొన్నటికి మొన్న కూతురు దగ్గరకు పోయి వాళ్ళ అత్తవాళ్ళను భయపెట్టి వేరు కాపురం పెట్టించింది. ఇప్పుడేమో తన కోడలు వేరుగా పోవాలంటే ఛస్తానంటుంది. ఏమాడదిరా బాబూ!" అనుకున్నాడు బుచ్చిబాబు రేణుకమ్మ ప్లానుకు బిత్తరపోయి.

3

రాత్రి ఎనిమిది గంటలవుతోంది. రేణుకమ్మ అప్పుడే వచ్చిన భర్త బుచ్చిబాబుతో కూర్చొని ఆనాటి వ్యాపార విషయాలు వింటూ కూర్చుంది. ఇంతలో రంగారావు గారు వచ్చారు. రంగారావు బెంగళూరులో వున్న రేణుకా ఇండస్ట్రీస్‌కు సి.ఇ.వో.గా పనిచేస్తున్నారు. రంగారావు ఆ కుటుంబ సభ్యుని కిందే లెక్క. బుచ్చిబాబుకు చిన్ననాటి స్నేహితుడు. రేణుకమ్మ దృష్టిలో మంచి నమ్మకమైన వ్యక్తి. ఆమె లెక్కల్లో బుచ్చిబాబు కన్నా రంగారావుకే మార్కులెక్కువ. అందువల్ల చిన్న కొడుకు చైతన్యను బెంగళూరులో వుంచి ఆయన పర్యవేక్షణలో ఇంజనీరింగ్ చేయిస్తూ వుంది.

అటువంటి రంగారావును చూడగానే రేణుకమ్మ లేచి నిలబడి

"రండన్నయ్యగారూ! ఏమిటి? చెప్పాపెట్టకుండా వచ్చారు. కూర్చోండి" అంటూ సాదరంగా ఆహ్వా నించింది.

రంగారావు బుచ్చిబాబు పక్కన కూర్చున్నాక "అన్నయ్యా! ఏం తీసుకుంటారు. కూల్‌డ్రింక్స్– కాఫీ, టీ" అని అడిగింది.

"మాంచి ఫిల్టర్ కాఫీ తెప్పించమ్మా!" అన్నాడు రంగారావు.

రేణుకమ్మ కాఫీ తెప్పించింది. కాఫీ తాగిం తరువాత కొంచెం రిలాక్సయి "అమ్మా! రేణుకా! చైతన్య వ్యవహార మేం బాగాలేదు. కాలేజి నుంచి రావడమే ఆలస్యం గెస్ట్‌హౌస్ నిండా పార్టీలే. ప్రతి ఆదివారం పబ్బులకూ, క్లబ్బులకూ వెళ్తున్నాడు. అక్కడంతా ఆడపిల్లలతో ఆటలు–పాటలు. వేలకు వేలు ఖర్చు చేస్తున్నాడు. ఇలాగే కంటిన్యూ అయితే ముందు ముందు చైతన్య మనకు దక్కడేమోననిపిస్తుంది. లేనిపోని సంబంధాలన్నీ యింటికి చుట్టేస్తున్నాడు. మొన్నీ మధ్య ఓ అమ్మాయి, మీ అబ్బాయి వల్ల గర్భవతినైనాను, పెళ్ళి జరిపించండని తల్లిదండ్రులతో వచ్చింది. బ్రతిమాలో, భయపెట్టో ఎలాగో మానేజ్ చేసి పంపాను. ఇక నేను వాడ్ని కాపాడ్డం కష్టం. వాడి బాగోగుల బాధ్యత నా మీద మోపారు గాబట్టి, విషయాలు చెప్పిపోదామని వచ్చాను. ఫ్లైట్‌కి రిటర్న్ టిక్కెట్ కూడా బుక్‌చేసుకున్నాను. ఇప్పుడే ఓ గంటలో వెళ్ళిపోవాలి. ఇక మీరేంచేసుకుంటారో మీ యిష్టం. చెప్పడం నా ధర్మం" అన్నాడు రంగారావు.

అంతా విన్న రేణుకమ్మ "ఏమిటన్నయ్యా అంత బాధపడుతున్నారు. డబ్బు పోతే పోయింది. నా కొడుకొక 'ప్రిన్స్' అని అర్థమైపోయిందిగా. ఆడపిల్లలు అలా వెంటబడే కొడుకును, ఒక మగాడ్ని కన్నందుకు నేనెంతో గర్వపడుతున్నాను" అంటూ భర్తవైపు చూసి కళ్ళెగరేసి "కుర్రాళ్లలా హుషారుగా వుండాలన్నయ్యా! దద్దమ్మల్లా వుండగూడదు. అదీ మాస్కులారిటీ. డబ్బు ఖర్చుకి మీరేం బాధపడకండి. లెట్‌హిమ్ ఎంజాయ్. నా కొడుకు కృష్ణుడిలా వుండాలి. అదే నా కోరిక. అయినా వాడికి ఒకసారి ఫోన్‌చేసి కనుక్కుంటాను. చూద్దాం వాడే మంటాడో?" అని చైతన్యకు ఫోన్‌చేసింది రేణుకమ్మ. రంగారావు చెప్పినవన్నీ అడిగింది. అందుకు ప్రతిగా చైతన్య చెప్పాడు–

"అమ్మా! మామయ్య యేదో చెబుతుంటాడు. అబద్ధాలేం గాదు– నిజాలే. ఆయన నాన్నలాగా పాత కాలం మనిషి. ఈ కాలం కుర్రకారు యెంతో ఫాస్టుగా వున్నారు. అమ్మా! నేను నీ కొడుకుని. ఇంటికి యే ఆపదా, అపఖ్యాతి రానీయను. నన్ను యెంతో లావిష్‌గా బ్రతకమని మన యిల్లు, మన సంపద మీదు మిక్కిలి మీరు చెప్పకనే చెప్పారు. భూమ్మీద సుఖపడితే తప్పు లేదుగా! మీ అందరికీ ఆ యోగం ఎలాగూ లేదు. నన్నైనా యువరాజుగా బ్రతకనీయండి. అదీ యెంతకాలం? పెళ్ళయ్యేదాకానే గదా! ఆ తరువాత నాకూ నాన్న, అన్నయ్యల వారసత్వం రాదని గ్యారంటీ యేముంది? నన్నైనా ఎంజాయ్ చేయనీయండి" అని.

"చూశారా అన్నయ్యగారూ! వాడు చెప్పిందీ యదార్థమే. ఇంట్లో ఒక్కడైనా కొడుగ్గా, మగ పురుషుడిగా యెదుగుతున్నాడంటే వాడ్ని కన్న తల్లి ఎంతలా సంతోషిస్తుంది? కృష్ణుడు యెంత అల్లరి చేసినా, ఎన్ని చీరలెత్తుకుపోయినా, గోపికల చేత బుగ్గలు కందేలా ముద్దులు పెట్టించుకున్నా యశోదమ్మ పొంగిపోయిందే

గాని ఒక్క మాటన్నదా? అలాగే నేనూ నా కొడుకు మగాడనుకుంటున్నాను. మగవాడు తిరక్క చెడతాడు. ఆడది తిరిగి చెడుతుంది. కాబట్టి వాడి స్వాతంత్ర్యానికి మనమెందుకు అడ్డుపడడం? వాడు నొచ్చుకోవడం చూడ లేము. అలాగే పోనీండి" అంది రేణుకమ్మ.

"ఒసి నీ దుంపదెగ. కొడుకు చెడిపోతున్నాడంటే వాడు మగాడంటావేమిటే జాగ్రత్తపడాలి గాని. నీ బుద్ధి తెలుసుకోవడం ఇంకో జన్మెత్తినా నా తరం గాదు" అనుకోవడం తప్ప పైకనలేకపోయాడు బుచ్చిబాబు.

"సరేనమ్మా! ఫ్లైటుకు టైమవుతుంది. నే వెళ్ళొస్తాను" అని రేణుకమ్మతో చెప్పి "ఏరా బుచ్చీ! డ్రైవరు లేడా?" అని అడిగాడు రంగారావు బుచ్చిబాబుని.

"నేనే వస్తాలేరా! అలా మాట్లాడుకుంటూ పోదాం" అంటూ లేచాడు బుచ్చిబాబు.

"అన్నయ్యా! జాగ్రత్తగా వెళ్ళిరండి. వాడి గురించేం వర్రీ అవకండి. ఇంకెంత ఒక్క సంవత్సరమే గదా! ఎలాగూ యిక్కడికొస్తాడు" అన్నది రేణుకమ్మ.

"అలాగేనమ్మా! చెప్పడం నా ధర్మం. వెళ్ళొస్తానమ్మా!" అంటూ బుచ్చిబాబును ఫాలో అయ్యాడు రంగారావు.

4

"ఆc! రావయ్యా! రా గుర్నాథం! ఏమిటి యిలా వచ్చావు? మీ అయ్యగారు ఆఫీసులోనే వున్నారుగా" హాల్లోకి అడుగుబెట్టిన గుర్నాథాన్ని చూసి అన్నది రేణుకమ్మ.

"నమస్తే మేడమ్! ఈ నెల్లో చివరిదాకా ఆగకుండా మధ్యలోనే మంత్లీ రిపోర్టిచ్చి పోదామని వచ్చాను. ఎన్నో యేళ్ళుగా ఆఫీసు జీతం గాకుండా ఎగ్స్ట్రాగా మీ వుప్పు తింటూ, యింతవరకూ మీకే వుప్పు అందించనందుకు బాధపడుతుండేవాడిని. ఇప్పటికి నాకా బాధ తీరిపోయింది. ఇన్నాళ్ళకు మీకో మంచి రిపోర్టు యివ్వగలుగుతున్నందుకు సంతోషంగా వుంది."

"ఆc! మంచి రిపోర్టా! తొందరగా చెప్పవయ్యా బాబూ!" అన్నది రేణుకమ్మ ఆదుర్దాగా కళ్ళింతవి జేసికొని, చెవులు రిక్కించి.

"అయ్యగారికి యిన్నాళ్ళకు తేనెటీగ కుట్టిందమ్మా!"

"తేనెటీగ కుట్టడం గూడా ఒక రిపోర్టా!" కసురు కుంది రేణుకమ్మ.

"అయ్యో! మీకెలా చెప్పాలి? తేనెటీగ కుట్టడం గూడా తెలియదా! అదే తెలిస్తే నెల నెలా నాకు జీతమిచ్చి మొగుడి మీద గూఢచర్యం యెందుకు చేయిస్తారు" అనుకున్న గుర్నాథం, "అది కాదమ్మా! అయ్యగారు ప్రేమలో పడిపోయారు" అన్నాడు తాపీగా.

"ఆc!" అంటూ నేలక్కొట్టిన బంతిలా సోఫామీద ఎగిరి పడింది రేణుకమ్మ.

"అవునమ్మా! ప్రేమలో పడిపోయి కొట్టుకుంటున్నారు గాని, యింకా కాలో, చెయ్యో విరగ్గొట్టుకోలేదు. దానికీ రెండు మూడు రోజుల్లో ముహూర్తం ఖరారైపోతుంది. అవును గాని మేడమ్ గారూ! అయ్యగారు యీ మధ్య కంపెనీ పనిమీదేమైనా ముంబై పోవాలని చెప్పారా?"

"చెప్పారు. అక్కడ నాలుగైదు రోజులు పనుందట."

"అద్గదీ! ఏ అనుమానమూ రాకుండా ఫౌండేషన్ గట్టిగా వేశారు గురువుగారు"

"జీడి పాకంలా లాక్కు త్వరగా చెప్పవయ్యా బాబూ! బి.పి. పెరిగిపోతోంది" అన్నది రేణుకమ్మ అసహనంగా.

# భువన బాంధవం!!

చిక్కుల్లో పడ్డ ఆర్థిక వ్యవస్థలో
సామాన్యుడు మాన్యుడూ నవ్వేడ్పుల మధ్యలో
అన్యోన్యంగానే నలిగిపోతున్నారు
అసామాన్య జీవితాల్నే కోరుకుంటున్నారు
దిక్కుల చుట్టూ దేశావేశాల దృక్కోణంలో
భారతీయం ఓ కోహినూరు వజ్ర సామ్రాజ్యం
ఆదేశాలతో ప్రక్కవాడి డొక్కలో చక్కిలిగిలి పెట్టేస్తూ
సదుద్దేశాల పట్టికల్ని అంతరీక్షగ్రహాల ఉట్టెలపై
వ్రాస్తున్నారు
గుర్తుకొచ్చే చెకుముకి రాళ్ళ శాస్త్రీయం
ఆప్తత్వాన్ని ఆవిష్కరించిన సుదూర ఖండాల
నేత్రుత్వం
ప్రతి కదలికకూ వెలుగు చీకట్లొచ్చాదనల్ని విశ్లేషించ
వినమ్రతను ప్రకటించ సమతావతార శక్తుల
ప్రభావం
సంతలపైబడి వాణిజ్య వికాసాన వంత పల్లవి
చరణాలావిలింతల
అంతేవాసుల సంతకాలతో ముంత కల్లును
ముట్టేస్తున్న
ప్రపంచీకరణ పైశాచిక నృత్యం పాలపుంతలో
కన్పిస్తున్నది
వశీకరణ పత్యం నిశీధి చైద్యావతారాల ప్రభాత
అనుపత్యమై
అంతరంగాంతరాళాల అనంత స్రవంతుల్ని
పొర్లించేస్తూ
ప్రాంతీయతల పారిభాషిక సూత్రాల్ని పుణ్యంలో
దొర్లించేస్తూ
అవురావురుమనేడుస్తున్న అజ్ఞాన విప్లవాల్ని
ఆరాతీస్తూ
అనువుగాని వేళల్ని కొనగోళ్ళతో నొక్కేస్తూ-
ఆశువు శాసనాల్ని అర్థాంతరంగా ఆమనిపై
రుద్దేస్తున్నది
ప్రపంచీకరణం వినసకర్ర వాయులీనంలా
ప్రకంపిస్తున్నది
పారదర్శక నేత్ర సంచయం పుష్పించే సమయాల్లో
అనంతకోటి ఆలోచనల సులోచనాల స్ఫురద్రూప
నిరూపణ
నివ్వెరపరుస్తున్న నాగరికత ఆలోకనావలోక
లోకాలను
అబ్బురపరుస్తున్న విజ్ఞానం రాజకీయ రంగాంగమై
ఆర్థిక కోశాల పారమార్థిక గాత్రాలను మదుపుచేస్తూ
మహీ సామంతాన్ని సంస్కరించే చేవ్రాళ్ళను
కుదిపివేస్తున్నది
అహరహం గ్రహగతుల తోడుగా విహరిస్తున్న
విలువార్థిక పత్రాలు
ముఖముఖాలాముఖ క్షేత్రాలపై స్వాగత ద్వారాల్ని
నిర్మిస్తున్నది
పూరిగుడిసెల్లో తెల్లెల్ల కార్డుల వీసాలు పరోక్షాన
గ్రీన్ కార్డులై
అరివడి సెలకు గురయ్యే కామత్వాన్ని శ్రమ
నిరూపణగా
సాక్షాత్కరింపజేస్తూ చైతన్యవసంతాన్ని ఊరూ వాడా
విసిరేస్తున్న
ఆర్థిక సూత్రాలల జదుల్ని గమనిస్తున్న వాణిజ్య
రంగం వేణువూదుతూ
ఉప్పెన సునామీల్ని వుద్దేశపూర్వకంగానే రాబడుల
కూడికల రంగరిస్తున్నది
బృంద బృందాలుగా ఆనంద విహారాల అజ్ఞాతజ్ఞుల
కల్పక జ్ఞానం
బృందావనాల్లో భూమిపూజలు చేస్తూ బుక్కా
చల్లేస్తున్న ఆర్థికావర్జాలు
శాంతి అహింసల్ని డెబిట్ క్రెడిట్ల నైపుణ్య
కంపనాలు సృష్టిస్తూ
భ్రాంతి దయనీయతను సమర్థించే సహకార జపం
స్మరిస్తున్నది
జీవప్రాణత్రాణల్నెరిగిన శాస్త్రీయ చపలత్వం
విముఖత్వ ప్రదర్శనల
సుఖలాలిత్యం సంభాళింపులను వాదస్వర
గద్దింపుల నృత్యం చేస్తున్నది
శూన్యంలో శుభ్రతనన్వేషిస్తూ మన్యం నుండి
మహానగర మనోద్వారాల
అన్యోన్య శిరోభార సహితాత్ముల ఆమరణ
తోరణాల్ని వ్రేలాడేస్తున్నది
నీతి జాతీయ ప్రతిబింబ శౌర్యాన అవినీతి
నందనత్వాన్నుబలాటపరుస్తూ
భీతిలేని ప్రయాణాన పుణ్యం పాపాల పర్యావరణం
రమిస్తున్నది.
జనావాసం కాని కోవెల ముందు కోలాహలం
జాతీయమై
అనాఘ్రాణిత పుష్ప సంచయాల పునరుత్పత్తి
ప్రకరణాల్ని పల్లవిస్తున్న
జనశ్రేణుల్ని నఖశిఖ పర్యంతం సకలైశ్వర్య
ఋణదర్పణాల దోపేస్తూ
అలౌకిక పారవశ్యాల ప్రమోద ఫలితాల్ని
దృశ్యీకరిస్తున్నది
దారుల్లో ఎడారుల్లో తడిపొడి తపోవనాల
తాదాత్మ్యాన్ని తీర్థీకరిస్తూ
మోడోయిన మూర్ఖత్వాన్ని ముందుగా సువర్ణ
మలాముతో సముద్ధరించ
అణగారిన చరిత్రలోని అంపశయ్యల మెత్తదనాన్ని
పునరుద్ధరిస్తున్నది
పూజాద్రవ్యాల సుగంధ బంధురంగా ప్రబంధాల
పైశాచికత్వాన్నే
ఉజ్వలానుమతుల వుపాహార భోక్తాభిజత్యాన
సంభావిస్తున్నది
నీడ ప్రక్క వెలుగుండదగిందే- వెలుగులేని చోటే
నీడన్న నీతి నిజం నిప్పులా
స్పృశించిన అనుభూతి తెలిసినప్పుడు
అణునాదమైనా, జన ప్రాణమైనా
అంచెలంచెలుగా నిర్మాణ పథాన పూరిగుడిసెల్ని
పుష్పింపజేస్తుంది!
బాంధను నేనన్న కాలాన్ని తరిమేసిన చరిత్ర
సంజాయిషీ చిందేస్తుంది!!

-కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు

## ఓ మనిషీ! ఎక్కడున్నావు నీవు?!

ఏ శక్తి నిన్ను / అశక్తుణ్ని చేయదో/అదే నీ దారి!
ఏ బాట నీ ఉనికికి / బాసటగా నిలుస్తుందో
అదియే నీ తోట!
ఏ మాట నిన్ను / కరుణా రసాస్వాదనతో
నింపుతుందో / అదియే నీ వేదం!
ఏ పాట నిన్ను / కార్యోన్ముఖుణ్ణి చేస్తుందో
అదియే నీ జీవనాదం!
ఏ వ్యక్తి నిన్ను / అవ్యక్త మధురానుభూతులతో
నింపుతాడో / వాడే నీ స్నేహితుడు!
ఏ పిలుపు నిన్ను/'కాంతి' తలపుల తలుపుల్ని తడుతుందో
అదియే నీ శాంతి!
నీలోని నీవునూ, / నాలోని నేనునూ,
'ఏకం' చేసే ఆ / ఏకైక 'ప్రక్రియ'
జీవిత పరమార్థాల్ని / తెలియజేసేది!
నాకూ, నీకూ / సమస్త ప్రకృతికీ
జీవనాడియై వెలిగే వెలుగులు
నిరంతరం సాగే ప్రత్యూషాలు!
వినూత్న జీవన విన్యాసాలు!
కాలం కమనీయం! / జీవితం రమణీయం!
కమనీయ కాలపు / పరిణామ స్రవంతిలో
రమణీయ జీవిత ప్రయాణ ప్రయాసల్ని
ఆశలతో నింపే / ఆ 'కర్మ హేతువులు'/సాక్షిభూతాలు!
అవ్యక్త భావాల్ని / వ్యక్తీకరించేవాడే విశిష్ట వ్యక్తి!
అమూల్య భావ విభవాలను
భావితరాలకై ఉంచేవాడే / ఉత్కృష్ట వ్యక్తి!
అవకాశాల్ని / ఆశావాదంతో మేళవించి
అందంగా మలిస్తే, పుడమిపై
'నందనవనాల్ని' తేవచ్చు;
హృదయాన్ని హృదయంతో
మనస్సును మనస్సుతో కలిపితే
'కలి'ని పంపేయవచ్చు/'ఆకలిని' చంపేయవచ్చు!
చిటారు కొమ్మల్లో / నివసించే పక్షికీ,
జీవితపు కటకటాల్లో వసించే/మనిషికీ ఎంత తేడా?!
అనునిత్యం/స్వేచ్ఛావాయువుల్ని పీల్చేది ఒకటి,
భయాందోళనల, కారుచీకటుల
కరిగే బ్రతుకు మరొకటి!
ఆడుతూ, పాడుతూ / ఆనంద డోలికల నూగే
నిస్వార్థపు, నిరపాయపు, అమాయకపు పక్షి...
శాంతిని తన నిండా నింపుకొని / విశ్రాంతి గీతాల్ని
'విశ్వ ప్రభాతపు' గీతాలుగా / పాడుతుంది!
స్వార్థపు, నిరంకుశపు
వికృతపు చేష్టల పరీవృతమైన మనిషి.
అశాంతికి నిలయం! / అంతా అంధకార బంధురం!
శాంతిని పంచేదొకరు,/అశాంతిని దించేదింకొకరు!
భూమికి నీరూ,/మనిషికి మనసూ, ఈ రెండూ...
ప్రకృతికీ... దాని / రమణీయాకృతికీ...
జీవం! / భావం! / అందం! / ఆనందం!
గొడ్డలితో నరికి/దాని రూపును చిందర వందర చేసినా,
చెట్టు కాగితమై 'ఈ మాటల్ని'
తనపై వ్రాయించుకోగల్గుతోంది!
తన ప్రతిమకు ప్రాణం పోస్తోంది!
కొండరాయి పగిలినా,/ బండరాయి చీలినా,
అది నడచే బాట అవుతుంది.
అరుగుల కవితలకు ఆలవాలమవుతుంది!
భావి అడుగుల/నిక్వణాలకు నిజమై నిలుస్తోంది!
ఓ మనిషీ!/ ఎక్కడున్నావు నీవు?
ఏమైపోతున్నావు నీవు?/ ఏమైపోతున్నావు నీవు?!

-కొండూరి రమాకాంత్

"రిజల్టు చెప్పేముందు నేనూ కన్ఫరం చేసుకోవాలి గదండీ! ఇది గూఢచర్యం గాబట్టి మిమ్మల్ని గూడా ప్రశ్నించవలసి వచ్చింది. రిజల్ట్ ఓ.కె. ఇక చెప్పేస్తాను."

"చెప్పవయ్యా గుర్నాథం"

"కొంచెం కూల్‌గా వినండి. బి.పి. పెంచుకోబోకండి. అసలు విషయానికొస్తే రెండు నెలల క్రితం మన ఆఫీసులో కొత్తగా 'లూసీ' అనే కేరళమ్మాయి సెక్రెటరీగా చేరిందని మీకూ తెలుసు. తెలియక పోవడమేమిటి? ఇంటర్వ్యూ చేసి అప్పాయింట్‌మెంటిచ్చింది మీరే. అదిగో ఆ 'లూసీ'తోనే అయ్యగారు ప్రేమలో పడిపోయారు. ఒక వారంగా సాయంత్రాలు సిటీ వెలుపలికి పోయి ధాబాల్లో చిరుతిండ్లు తింటూ గంటలు గంటలు కాలక్షేపాలు చేస్తున్నారు."

"అందుకే గాబోలు యీ మధ్య ఆయన రాత్రిపూట సరిగా భోజనం చేయడంలేదు. అదేమని అడిగితే వయసు పైనబడుతున్నది గదా! ఆరోగ్య సూత్రాల రీత్యా రాత్రిపూట తిండి తగ్గిస్తున్నాను అన్నారు. అసలు సంగతి యిదన్నమాట."

"అదే మేడమ్! అసలు సంగతి అదే. ఏమైనా అయ్యగారికి ముందు చూపు ఎక్కువే" మెచ్చుకొన్నట్లుగా అన్నాడు గుర్నాథం.

"ఆయన మొహం, ఆయనదిప్పటి ముందుచూపైతే నాది యిరవయ్యేడేళ్ళ నాటి ముందుచూపు. అందుకే నీకీ సిఐడి అవతారం. నన్ను తక్కువ అంచనా వేసుకోకు. ఈ రేణుకమ్మ డిక్షనరీలో లేనిమాట 'అసాధ్యం'. చూస్తా ఆయన సంగతి. అవును గాని గుర్నాథం! ఈయనకిప్పుడిదేం పోయేకాలం మనవడో మనవరాలో రాబోతుంటే?"

"పోయేకాలం గాదమ్మా! కలిసొచ్చే కాలం, ఎక్కువగా మగాళ్ళకు సెకండ్ సెటప్‌లు యేర్పడే కాలం యిదే. 45-55 సంవత్సరాల మధ్య యిలాంటివి జరుగుతుంటాయి. ఆ టైములో భార్యలు, పిల్లల ఆలనా, పాలనా చూసుకుంటూ మొగుడ్ని కొంచెం మూలకు నెట్టేస్తారు. ఎన్నాళ్ళని మూలన కూర్చుంటారు? అప్పుడు యిదిగో యిలాంటి దారులు వెతుక్కుంటారు."

"వెతుక్కుంటాడు- వెతుక్కుంటాడు. రాత్రికి యింటికి రానియ్. ఏం వెతుక్కుంటాడో చూస్తా. వెరీగుడ్ గుర్నాథం. మంచి రిపోర్టు తెచ్చావు. నీకు దీపావళికి బోనస్‌గా అయిదు వేలు శాంక్షన్డ్" అన్నది రేణుకమ్మ ఆనందంగా.

అంతేకాదు మేడమ్! అయిదు రోజులు ఆఫీసుకు సెలవుపెట్టి టాక్సీ బాడుగకు తీసుకొని, వాళ్ళెటుబోతే అటు సిటీ నలువైపులా రోజుకోవైపు పోయి సమాచారాన్ని సేకరించాను. ఇదిగోండి టాక్సీ బిల్లు, డ్రైవరు బత్తా, నా ఖర్చులు అన్నీ కలిపి 11,500 రూపాయలు అయిందమ్మా!

"అవునుగదూ! అది వూహించలేదు. బోనస్‌తో కలిపి మొత్తం పదహారువేల అయిదు వందలన్నమాట" అంటూ లోపలికి పోయి బీరువాలో నుంచి వంద రూపాయల కట్టలు రెండు తీసి, గుర్నాథానికిచ్చి "ఇదిగో 20 వేలు. నీ ఖర్చులు పోను మిగిలిన వాటితో పిల్లలకు, మీ భార్యకు గుడ్డలు కొనుక్కుపో" అన్నది రేణుకమ్మ.

గుర్నాథం ఉబ్బితబ్బిబ్బై, ఆ డబ్బు తీసుకొని "అమ్మగారూ! కేసు జాగ్రత్తగా డీల్ చేయండి. పొరపాట్న నా పేరు బయట పడిందంటే వుద్యోగానికే ప్రమాదం" అన్నాడు వేడుకున్నట్లుగా.

"నీకొచ్చిన భయమేమీ లేదు గుర్నాథం! అవన్నీ నేను చూసుకుంటానులే. కేసు ఎలా డీల్ చేయాలో, ఎట్నుంచి నరుక్కురావాలో ప్లాను సిద్ధంజేసుకోవాలి గదా! ఇక పోయిరా"

"సరే. వస్తాను మేడమ్! ఇక నా పనయిపోయింది" అంటూ వెనుదిరిగాడు గుర్నాథం.

"హలో గుర్నాథం! ఇంతటితో నీ పని అయిపోయిందనుకుంటున్నావా? అయిపోలేదు. ఆయనకు అరవై యేళ్ళు వచ్చేదాకా నీ వుద్యోగం పొడిగిస్తున్నాను. ఈ మగాళ్ళనెవరు నమ్మారు? ఎప్పట్లాగే జీతం తీసుకుపోతూ వుండు" అన్నది రేణుకమ్మ.

"అంతా తమ దయ. పిల్లలు గలవాడ్ని. వస్తాను మేడమ్!" అంటూ నిష్క్రమించాడు గుర్నాథం మహదానందంగా.

రాత్రి ఎనిమిది గంటలపైన బుచ్చిబాబు కారు లోపలికొచ్చింది. కారు దిగి హుషారుగా యీలవేసుకుంటూ లోపలికి రావడం రేణుకమ్మ గమనించింది. శరీరం వుడికిపోయింది. కాని తమాయించుకొని "రానియ్ చూద్దాం. అప్పుడే తొందర పడగూడదు. ఇంకెన్ని వెధవ్వేషాలేస్తాడో చూద్దాం" అనుకుని ఓ ప్లాస్టిక్ నవ్వు ముఖాన పులుముకొని ఎదురేగి "ఏమిటండీ రోజురోజుకు మీరు మరీ లేటుగా వస్తున్నారు. మీ ఆరోగ్యమేంగాను? అందులోనూ యీ మధ్య ఆరోగ్య సూత్రాలంటున్నారు గూడా!" అన్నది గోముగా.

"పనోయ్ పని. ఎంత లాగినా సాగడంలేదు. ఆ చచ్చువెధవాయ్ గుర్నాథం గాడు అయిదు రోజులుగా సెలవులో వున్నాడు. వాడి సీట్లో పని మరెవరికీ తెలియదు. అదిగూడా నేను చూడాల్సొస్తుంది. మన పని మనం చేసుకోవాలి గదా తప్పుతుందా! అదేనోయ్ లేటు" శోభన్‌బాబు లెవిల్లో చేతులూపుతూ యమ హుషారుగా చెప్పాడు బుచ్చిబాబు.

"అవునవును తప్పుతుందా? గుర్నాథం చచ్చువెధవాయా? ఆ చచ్చువెధవాయి లేకపోతే నీ పుచ్చు బయటపడేదా!" అనుకుని.

"పోనీ మీరంత శ్రమ తీసుకోకపోతే ఆ చచ్చువెధవాయిని సెలవు కాన్సిల్ చేసుకుని రమ్మనచ్చు గదా!" అంది రేణుకమ్మ.

"ఆఁ ఏముందిలేవోయ్! ఇంకో రెండు రోజులు, నాకింకా జవసత్వాలుడిగిపోలేదుగా'' అన్నాడు బుచ్చిబాబు పైలా పచ్చీసుగా.

"జవసత్వాలుడిగిపోలేదా? కాసేపాగు. వాట్నెలా వుడకబెట్టాలో నాకు తెలుసు" అనుకుని "రండి, స్నానం చేయండి. భోంచేద్దాం. నాకాకలిగా వుంది" అన్నది షర్టు బటన్లు విప్పుతూ.

"ఏమిటోయ్ యెప్పుడూ లేనిది యింత ప్రేమ." కళ్ళెగరేస్తూ అన్నాడు బుచ్చిబాబు.

"అప్పుడప్పుడూ అలా ప్రేమకురిపించాలని పిస్తుంది లెండి" అన్నది రేణుకమ్మ ఓరగా చూస్తూ.

బుచ్చిబాబు స్నానం చేసొచ్చాక భోజనం వడ్డించింది రేణుకమ్మ. అందులో చికెన్ కర్రీ సర్వ్ చేసింది. అది చూసిన బుచ్చిబాబు "ఇదేమిటి చికెన్ చేశావు? నాకంత ఆకలిగా లేదు" అన్నాడు. ఇంతకు ముందే 'లూసీ'తో

ధాబాలో చికెన్ 69 తినొచ్చాడు. ఇంకేం తింటాడు?

"ఫరవాలేదండీ! మీరో వారం రోజులుగా రాత్రిపూట సరిగా భోజనం చేయడంలేదు. అదేమంటే ఆరోగ్య సూత్రమంటున్నారు. అందుకే జిహ్వకు కొంచెం రుచిగా వుంటేనన్నా తింటారని చేశాను. తినండి. శ్రమకు తగిన తిండి తినాలండీ పనెక్కువంటున్నారుగా. లేకపోతే మీ ఆరోగ్య సూత్రాలేమో తెలియదు గాని, నా మంగళ సూత్రాలు నేను కాపాడుకోవాలిగా" అన్నది రేణుకమ్మ బులిబుచ్చికంగా.

ఇక తప్పదని రెండు ముద్దలు, రెండు ముక్కలు లాగించేశాడు బుచ్చిబాబు. అప్పుడడిగింది రేణుకమ్మ. "ఏమండీ! చికెన్ ఎలా వుంది? మీకోసం స్పెషల్‌గా చేశాను. సిటీ అంచుల్లో యే ధాబాల్లోనైనా యిటువంటి చికెన్ దొరుకుతుందా?" అని.

గుండె గుభేల్మంది బుచ్చిబాబుకు. దొంగ-భుజం సామెత గుర్తుకొచ్చింది. అయినా యే ఫీలింగూ బయట పడకుండా తొక్కిపెట్టి "ధాబాల్లో మనమెప్పుడు తిన్నామోయ్ తెలియడానికి?" అన్నాడు ముక్తసరిగా.

"కాదులెండి. ఎప్పుడైనా ఫ్రెండ్స్‌తో కలిసి తినుంటారేమోనని అడిగాను"

"అదేం లేదోయ్. బయట తిండ్లంత యిష్టంగా వుండవు నాకు"

"మీ సంగతి నాకు తెలియదా! ఔనుగాని మీరు ముంబై పోవాలంటున్నారు గదా! సిగ్నల్ వచ్చిందా? ప్రయాణమెప్పుడు?"

"మంచి టైములో జ్ఞాపకమొచ్చిందోయ్ నీకు. అదే చెబుదామనుకుంటున్నాను. ఎల్లుండి వుదయమే ప్రయాణం."

"ఉదయం ఫ్లైట్ లేదుగదండీ!"

"ఈ ట్రిప్పు ఫ్లైట్‌లో పోవడంలేదు. కారులో పోతున్నాను. మధ్యాహ్నాని కక్కడుంటాను. సాయంత్రం ఆరు గంటలకొక మీటింగు తరువాత రెండు మూడు రోజులు మన ఫాక్టరీ వ్యవహారాలు చూడాలి."

"సరే, నేను గూడా వస్తానండీ! అసలే మీరు ఆరోగ్య సూత్రాలంటున్నారు. మీకు తోడుగా వుండి, మీ శరీరంలో సగభాగమై మిమ్మల్ని కాపాడుకుంటాను" గోముగా అన్నది రేణుకమ్మ.

బుచ్చిబాబు నోట్లో వెలక్కాయ పడ్డట్లయింది. నోటిదాకా పోవలసిన అన్నం ముద్ద జారి ప్లేట్లో పడిపోయింది. అది గమనించిన రేణుకమ్మ "ఏమిటండీ! అలా అదిరిపడ్డారు. నేను రావడం మీకేమైనా అడ్డమా? లేక అభ్యంతరమా?" అన్నది.

బుచ్చిబాబు తెప్పరిల్లుకొని "అదేం లేదోయ్! ఏదో చేజారింది. రెండు మూడు రోజులకు నువ్వెందుకులే. వూరికే గోరంతలు కొండంతలు జేసుకొని భయపడు తుంటావు. నాకేం కాదులే" అన్నాడు.

"ఏదో అవుతుందని కాదులెండి. అవగూడదని- పోనీ నన్ను గాకపోయినా ఆ 'లూసీ'నైనా తీసుకు పోగూడదూ. అన్నింటికీ తోడుగా వుంటుంది" మూతి బిగించింది రేణుకమ్మ.

బుచ్చిబాబు గుండెల్లో బండపడింది. "ఇదేమిటి? ఏదో తెలిసిపోయినట్లు అంత నర్మగర్భంగా మాట్లాడు తుంది. కొంచెం ఎక్కువ తక్కువలు మాట్లాడితే దొరికి పోతానేమో? అయినా, దీనికేమైనా తెలుస్తున్నాయా? అయితే ఎలా తెలుస్తున్నాయి?" అనుకుంటూ గుడ్లప్ప గించి ఆమె ముఖంలోకి చూస్తున్న బుచ్చిబాబుతో-

"ఏమిటి? క్రికెట్ అంపైర్‌లా మాటా పలుకూ లేకుండా అలా గుడ్లప్పగించి చూస్తున్నారు. మాట్లాడండి. నన్ను రమ్మంటారా. లూసీనే తీసుకుపోతారా?" రెట్టించింది రేణుకమ్మ.

"ఏమిటో? అంతా అగమ్యగోచరంగా వుంది. నువ్వు మాట్లాడేదేమిటో నాకేమీ అర్థంగావడంలేదు" నసిగాడు బుచ్చిబాబు.

"ఎందుకర్థమౌతుంది? రోజూ సాయంత్రం ఆ లూసీతో కారులో షికార్లు కొడుతూ, సిటీ అంచుల్లో ఎన్ని ధాబాలున్నాయో లెక్కబెట్టడం, దేంట్లో యేది స్పెషలో అది రుచిచూడడం, ఫ్యాక్టరీ పని నెపంతో ముంబై పోయి నాలుగైదు రోజులు కోరుకున్నట్లు, జల్సాగా కులికి రావాలనుకోవడం అన్నీ నాకు తెలుసు" కుండ బద్దలుకొట్టింది రేణుకమ్మ.

"అన్నీ కల్పనలు. లేనిపోనివి వూహించుకొని నన్ను తికమక పెట్టేస్తున్నావ్. కాకపోతే పరీక్ష పెడుతున్నావ్"

"తికమకలు, పరీక్షలు ఏవీ లేవు. నీ సరదాలు, షికార్లు అన్నీ నా వేగుల ద్వారా యెప్పటికప్పుడు తెలిసి పోతున్నాయి. పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతూ యేమనుకుంటుందో తెలుసుగా! అలా అనుకోకండి. నీ కథంతా తెలుసు" దబాయించింది రేణుకమ్మ.

"నోరుంది గదా అని యేవిబడితే అవి నీ యిష్ట మొచ్చినట్టు మాట్లాడకు. ఎవరా వేగులు? అంతా తప్పుడు సమాచారం. అలాంటివేమీ లేవు. అన్నీ అభూత కల్పనలు" బుకాయించాడు బుచ్చిబాబు.

"మీరనుకుంటున్నారు నాకు గూఢచారుల్లేరని. మీ మగబుద్ధి నాకు తెలుసు. మొదటి కాన్పుకు మూడు నెలలు మా పుట్టింట్లో వున్నపుడే నేను గూఢచారిని నియమించుకున్నాను. ఇంతటితో అయిపోలేదు. ఇంకా కొన్నేళ్ళు అదే యింతకు ముందేదే అన్నావ్ జవసత్వాలని గదూ! అవి వుడిగిపోయేదాకా నీ మీద నిఘా వుంటుంది. అయినా యిదేం పాడుబుద్ధి? మగవాళ్ళు తిరిగి చెడతారు. ఆడవాళ్ళు తిరక్క చెడతారని తెలియదా?"

"అదేమిటోయ్! మగవాళ్ళకు యెంతో సపోర్టుగా వున్న 'మగవాడు తిరక్క చెడతాడు, ఆడది తిరిగి చెడుతుంది' అనే సామెతను యిలా 'జంబలకిడి పంబ'ను చేశావు. నీకేదో అయింది. మతిబోయింది" చేయి తిప్పుతూ అన్నాడు బుచ్చిబాబు.

"మతిపోనూ లేదు, పిచ్చి పట్టనూ లేదు. అది ఆనాటి సామెత. ఈ కాలపు సామెత యిదే"

"అదెలా?"

"ఎలాగా? మగాడు తిరిగి తిరిగి యే ఎయిడ్సో, గియిడ్సో తెచ్చుకొని చెడతాడు. వాడు చెడింది గాక ఎక్కడా తిరక్కపోయినా యింటిదాని కంటించి చెడగొ తాడు. అర్థమైందా?"

"ఓసి నీదుంపదెగ. నీ తెలివి తెల్లవార. ఎంత నెరజాణవే?" అనుకున్న బుచ్చిబాబు మరేమీ మాట్లాడ లేక, కుడితిలో పడ్డ ఎలకలా వూహించుకొని ప్లేట్లో చేయి కడుక్కుని చేష్టలుడిగి కూర్చున్నాడు తలపట్టుకొని.

బుచ్చిబాబును ఆ భంగిమలో చూచిన రేణుకమ్మ "ఇదిగోండి. ఇప్పుడే చెబుతున్నా. ఆ పిల్లతో మీ షికార్లకు ఫుల్‌స్టాప్ పెట్టాను. మీ ముంబై ప్రయాణం కాన్సిల్. ఆ లూసీ వుద్యోగం పీకేసి కడుపుగొట్టడం నాకిష్టంలేదు. నేను యింటి దగ్గరుండి మాత్రం చేసేదేముంది? ఫ్యాక్టరీకి పోయి మీ పనులు నేనే చూసుకుంటాను. మీరు యింటి పట్టునుండి ఆరోగ్య సూత్రాలు పాటించండి" అని చెప్పి చకచకా బెడ్‌రూములోకి దారితీసింది.

"ఓసి నీయమ్మకడుపు కాలా! కొడుక్కొక న్యాయం మొగుడికొక న్యాయమా? వాడు చెడు తిరుగుళ్ళు తిరుగు తున్నాడని చెబితే వాడు మగాడన్నావ్. మగసిరన్నావ్. శ్రీకృష్ణుడన్నావ్. నేను జూలు విదల్చగూడదంటున్నావ్, మగసిరి చూపగూడదంటున్నావ్. ఇద్దరం మగాళ్ళమేగా. చెరొక రూలా? ఆహా భార్యామణీ! నీకిన్ని ముఖాలున్నా యని కలలో గూడా అనుకోలేదే! ఈ జన్మకింతే. దీన్ని యెదుర్కోలేం సర్దుకుపోవడం తప్ప" అనుకుంటూ లేవలేక కుర్చీకతుక్కుపోయాడు మనసు మొద్దుబారిన బుచ్చిబాబు.

■

## ఎద్దురా కన్నయ్య

అవతలి వాణ్ణి వెక్కిరించకు
అలా వంకరగా మూతితిప్పకు
వాడిలోని వికృతిని చూసి నవ్వకు
వాడికన్నా అందగాణ్ణని మురువకు
కాలం ఎన్నో లీలలు చేస్తుంది
నీలోనూ మార్పులు తెస్తుంది
కండలు తిరిగిన నీ శరీరాన్ని
ఎండు పుల్లలాగా చేస్తుంది
వాడు గుడ్డివాడని ఒకసారి నవ్విన నీవు
నేడు గుడ్డివాడివి కావడం చిత్రం
కర్రసాయంతో నడిచే కుంటివాణ్ణి చూసి నవ్విన నీవు
కాలు పడిపోయి కర్రనే ఆశ్రయించడం చిత్రం
వాడి వికార ముఖాన్ని చూసి అసహ్యించుకున్న నీవు
పక్షవాతం బారిన పడ్డ ముఖంతో రోదించడం చిత్రం
కాలం ఎప్పుడేం చేస్తుందో
ఎవరికి తెలుసు?
నిన్ను నీవు చూసుకొని
పొంగిపోకు
ఎవణ్ణీ వెక్కిరించకు
వంకరగా మూతి తిప్పకు
వెక్కిరించే వాణ్ణే
ఓనాడు కాలం
వెక్కిరిస్తుంది
తన లీల చూపిస్తుంది
అందుకే
ఇప్పటి అందాన్ని చూసి మురిసిపోకు
రేపటి మాయను మరచిపోకు
ఎవణ్ణీ అపహసించకు
ఎవణ్ణీ వెక్కిరించకు

-డా॥ తిరునగరి